


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## పుణ్యం కొద్దీ....

**కెవ్వుమంది నిత్య.** విరామం లేకుండా ఆ పాప ఒంటిమీద దెబ్బలు పడుతూనే ఉన్నాయి. వేగంగా వచ్చిన శ్రీధర్ పాపని దగ్గరకి లాక్కుంటూ అరిచాడు.

"నువ్వు మనిషివా? రాక్షసివా?"

"రాక్షసిని. అందుకేగా తిరుపతికి ఒక్కడ్నే పోతానన్నావ్?" వనజ మొహం వికృతంగా పెట్టి చెప్పింది.

"ఛీ.ఛీ! కన్నతల్లి ఇంతలా కొడుతుందని చెప్పినా ఎవరూ నమ్మరు. దీని ఖర్మ, నా ఖర్మ కాలి నీ పాలన పడ్డాం"

శ్రీధర్ వెక్కుతున్న నిత్యని భుజాన వేసుకుని అదే బ్లాక్‌లో మరో ఫ్లోర్‌లో ఉన్న తల్లి దగ్గరకి వెళ్ళాడు.

రాత్రి వంటకి కూరలు తరుగుతున్న విమలమ్మ కొడుకు భుజానున్న మనవరాలిని అందుకుంది.

నాయనమ్మని చూసిన నిత్య పెద్దగా ఏడుపు లంకించుకుంది.

"చచ్చేట్టు కొట్టింది" శ్రీధర గద్గదంగా చెప్పాడు.

పాప ఒంటిమీది దెబ్బలు చూసిన విమలమ్మకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అదేం తల్లిరా? ఎవరిమీద కోపం వచ్చినా బిడ్డని కొట్టడమేనా? ఏం చేసావు? దానికెందుకు కోపం వచ్చింది?" అడిగింది.

శ్రీధర్ ఉసూరుమంటూ సోఫాలో కూలబడ్డాడు. విమలమ్మ కొబ్బరినూనె సీసా తెచ్చి, నిత్య గౌను విప్పి దెబ్బలమీద నూనె రాయసాగింది.

"సునీల్ వాళ్ళ బావ కొత్తషాపు తీసుకున్నాడు. లీజు కాగితాలు దేవుడి దగ్గరపెట్టి పూజ చేయించుకోడానికి తిరుపతి వెళ్తూ నన్నూ రమ్మన్నాడు. లేడీస్ ఎవరూ లేరు. బావ, సునీల్, నేనే. సరేనన్నా. ఇంటికి వచ్చి చెపితే, నేనూ వస్తానని తయారైంది. 'నువ్వు రావద్దు, లేడీస్ ఎవరూ లేరంటే వింటేనా? నీకు తెలుసుగా. అరుపులు, కేకలు. కిందికి వెళ్ళి 'అర్జెంట్ పని పడింది, రానని' సునీల్‌కి చెప్పి పైకి వచ్చేలోపల పిల్లని..."

"అంతా ఆ మాయదారి లక్ష్మి మూలంగానే. నా తమ్ముడి కూతురు మంచిపిల్ల, వినయం, విధేయత, పెద్దలమీద గౌరవం వున్న పిల్ల. ఈ కాలంలో అలాంటి వాళ్ళు నీకు దొరకరు అని మాయమాటలు చెప్పి, ఈ బ్రహ్మరాక్షసిని అంటగట్టింది. ఏడాదిలోగా ఇది నన్ను వెళ్ళగొట్టింది. నీకూ, నాకు మనశ్శాంతిలేకుండా పోయింది" విమలమ్మ చెప్పింది.

"దానికి పిచ్చే అమ్మ. కాకపోతే ఎవరైనా కన్నబిడ్డని అంతగా కొట్టుకుంటారా? మొన్నేం చేసిందో తెలుసా?" తల్లిని చూసి మాట్లాడటం ఆపేశాడు శ్రీధర్.

"ఏం చేసింది?" విమలమ్మ కంగారుగా అడిగింది.

"నిత్యని రెక్కలు పట్టుకుని ఎత్తి బాల్కనీలోంచి కిందకి గాల్లోకి ఊపుతూ కింద పడేస్తానని అరుపులు. దగ్గరకి వస్తే వదిలేస్తానని బెదిరింపులు. ఇదేమో భయంతో ఏడుపు. నాకేం చేయాలో తోచలేదు..."

"...ఏంటీ? ఆరో అంతస్థులోంచి కిందకి పడేస్తానందా? నిజంగా పిచ్చేరా దానికి" విమలమ్మ గుండెలమీద చేతులుంచుకుంది.

"అది సినిమాకి వెళ్దాం అంటే ఒద్దన్నా. అందుకే ఆ గోల. సినిమా కోసం పిల్లని చంపుకుంటుందా? నాకేం చేయాలో అర్థంకావడంలేదమ్మా. ఏమన్నా అంటే 'హెరాస్‌మెంట్ కేస్ పెట్టి నిన్నూ, నీ అమ్మని జైల్లో పెట్టిస్తా' అంటుంది. దాని బ్లాక్ మెయిలింగ్‌కి చచ్చిపోతున్నాను" శ్రీధర్ అలసటగా చెప్పాడు.

ఆ మధ్యాహ్నమే వనజ తన ఫ్లాట్‌కి వచ్చి 'నీ కొడుకు నాతో కాపురం చేయట్లేదు వాడు మగాడేనా?' అడిగిందని, 'వాడు మగాడు కాకపోతే నిత్య ఎవరికి పుట్టింది?' అని తను కోపంగా అడిగేసరికి పిల్లని కొట్టుకుంటూ తీసుకెళ్ళిందని విమలమ్మ కొడుక్కి చెప్పలేకపోయింది.

"నాకో పదివేలు కావాలి" వనజ అడిగింది.

"ఎందుకు?" శ్రీధర్ అనాలోచితంగా అడిగాడు.

"చెప్తేకానీ ఇవ్వవా? జిమ్‌లో చేరాలి"

"జిమ్మా?" నోరు తెరిచాడు.

"అవును. ఓవర్ వెయిట్ వున్నా కొంచెం తగ్గుదామని."

"తగ్గాలనుకుంటే, తిండి తగ్గించు. పనిమనిషిని మాన్పించి ఇంట్లో పనులు చేసుకో అంతేకానీ జిమ్ ఏమిటి?"

"నేను డిసైడ్ అయ్యాను. జిమ్‌లో జాయినయ్యాను కూడా. నువ్వు పదివేలిస్తే, ట్రాక్‌సూట్, షూస్ కొనుక్కుంటా. మధ్యాహ్నం పదకొండు నించి పన్నెండుదాకా. నిత్యని మీ అమ్మ దగ్గర వదులుతా" వనజ ఆనలైన్‌లో ఆర్డర్ చేసిన ఫ్రెంచ్ ఫ్రైస్ తింటూ చెప్పింది.

"అంత లావు మనిషి, ఆ పేంటూ, టి షర్ట్ వేసుకుని వెళ్తూంటే రోడ్డుమీది వాళ్ళు ఏమనుకుంటార్రా అబ్బాయ్? మన ఫ్లాట్స్‌లో వాళ్ళు నవ్వుతున్నారు" విమలమ్మ లబలబలాడింది.

శ్రీధర్ నిస్సహాయంగా చూసాడు.

"పిల్లల్ని దరిద్రపు పెంపకం పెంచి, మాయమాటలు చెప్పి మనలాంటివాళ్ళకి అంటగడుతున్నారే వీళ్ళమీద మనం వేయాలి హెరాస్మెంట్ కేసు. ఈ మధ్య అద్దంలో నీ మొహం చూసుకున్నావా? కళ్ళకింద నల్లగా, నీరసంగా, కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని వున్నావు. నా దగ్గరకొచ్చి తిండానికి లేకుండా పిల్లమీద ఒట్టు పెట్టింది. ఏమన్నా అందామంటే కేసు అని బెరింపులు" విమలమ్మ ఆక్రోశంగా చెప్పింది.

"అమ్మా ఆ గంటా నిత్య నీ దగ్గరుంటే ఇబ్బంది లేదుగా? లేకపోతే ఎక్కడైనా డే కేర్‌లో చేర్చుకుంటారేమో అడగనా?"

"ఇబ్బందేమీలేదు నాయనా ఇప్పటికే అది నిన్ను డబ్బు, డబ్బు అని పీక్కుతింటోంది. ఎంతకని చేస్తావు? అలివికాని పెళ్ళాన్ని చేసుకుంటే ఇంతే మరి" ఆవిడ నిట్టూర్చింది.

"కాశ్మీర్ వెళ్తున్నా" విలాసంగా కూర్చుని చిప్స్ తింటూ టివి చూస్తున్న వనజ చెప్పింది.

శ్రీధర్ బిత్తరపోయాడు.

"మా జిమ్ మేట్స్ అంతా కలిసి వెళ్దామనుకుంటున్నాం. ఇక్కడినించి ఢిల్లీకి ఫ్లయిట్. అక్కడినించి జమ్మూకి. ఆ తర్వాత ప్రైవేట్ టేక్సీలు, జీప్‌లు ఏభైవేలదాకా అవుతుందేమో."

"ఇప్పుడు అక్కడికి ఎవర్నీ రానివ్వడంలేదనుకుంటా" గొంతు పెగుల్చుకుని చెప్పాడు.

వనజ పెద్దగా నవ్వింది.

"నీలాంటి బడుద్దాయిలకి అంతకంటే ఏం తెలుస్తుంది. నా అకౌంట్‌కి ఫిఫ్టీ థౌజెండ్ ట్రాన్స్‌ఫర్ చెయ్యి. నిత్యని మీ అమ్మని చూసుకోమను. పదిరోజుల్లో వచ్చేస్తా" చెప్పింది.

"నా వల్ల కాదు. నా దగ్గరలేదు."

ఆమె కళ్ళు కోపంతో పెద్దవయ్యాయి.

"నాకు అనవసరం తల తాకట్టు పెట్టయినా తేవాల్సిందే"

"బడుద్దాయినని నువ్వే అన్నావుగా? నా తల ఎవడికి కావాలి?"

"అంటే? ఇవ్వవా?" క్రోధంగా అరిచింది.

"ఇవ్వను. కానీ... మొదలు పెట్టు పిల్లని కొట్టు" శ్రీధర్ కూడా అరిచాడు.

"నేను ఆత్మహత్య చేసుకుంటాను."

"మంచిది"

"నా చావుకి కారణం నువ్వేనని రాస్తా."

"ఈ నరకం కంటే, జైలే బెటర్ అలాగే కానీ."

ఎప్పుడూ చెప్పింది వినే శ్రీధర్ అలా రెచ్చగొడుతూ మాట్లాడేసరికి వనజలో కోపం ఉవ్వెత్తున ఎగిసింది.

శ్రీధర్ లేచి తలుపు మూసి పక్కింటి తలుపు కొట్టాడు. తలుపు తెరిచిన పక్కింటావిడని అడిగాడు.

"మా నిత్య మీ ఇంట్లో ఆడుకుంటోందాండీ?"

"లేదు. ఇవాళ వనజ జిమ్ నించి వస్తూ నిత్యని తెచ్చినట్లు లేదు. మీ అమ్మ దగ్గరే వుండచ్చు." ఆవిడ సానుభూతిగా చూస్తూ చెప్పింది.

శ్రీధర్ లిఫ్ట్ వైపు నడిచాడు.

వనజ క్రోధంగా వంటగదిలోకి వెళ్ళింది. ఒంటిమీద కిరోసిన్ పోసుకుని అతన్ని బెదిరిద్దామనుకుంది కానీ రెండో సిలిండర్ ఉండటం వల్ల వాళ్ళింట్లో కిరోసిన్ స్టాక్ లేదు.

గేస్ లీక్ చేసి బెదిరిద్దాం అనుకుంది. కానీ కాలింగ్ బెల్ మోగినా లీకైన గేస్ మండిపోతుందేమో అని భయపడింది. ఇల్లంతా తిరిగి చూసింది. లో రూఫ్ అపార్ట్‌మెంట్. చేతులెత్తితే తగిలే ఫేన్‌కి ఉరిపోసుకోలేదు. 'ఛీ చావడానికి కూడా ఈ దరిద్రపు కొంపలో అవకాశం లేదు' గొణుక్కుంది.

ఆమెకి శ్రీధర్ మెతకతనం తెలుసు. హెరాస్మెంట్ కేస్ అంటేనే భయపడేవాడు 'ఛస్తా' అంటే ఇంకా భయపడతాడు అనుకుంది. అతను ఆఫీస్‌నించి వచ్చిన వెంటనే కాక, కాసేపయ్యాక చెప్పాల్సింది కాశ్మీర్ సంగతి అని తనని తను తిట్టుకుంది.

చివరికి కూరలు కోసే కత్తిని తీసుకుంది. 'దీంతో చేతిమీది నరం కోసుకుంటానని బెదిరించాలి. చచ్చినట్లు తెచ్చిస్తాడు డబ్బులు' అనుకుంది.

కిందినించి పిల్లల నవ్వులు, అరుపులు వినిపిస్తున్నాయి. శ్రీధర్ కూడా నిత్యని ఆడించడానికి కిందకి తీసుకెళ్ళివుంటాడు. పైకి రమ్మని పిలవాలి. రాత్రి ఎనిమిదికల్లా తాను ప్రయాణం కన్‌ఫర్మ్ చేయాలి.

వనజ బాల్కనీలోకి వచ్చి తొంగిచూసింది. ఆమె కళ్ళు విశాలమయ్యాయి. శ్రీధర్, పక్కింటావిడ నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆవిడ కొడుకు, నిత్య బంతితో ఆడుకుంటున్నారు.

పైకి చూస్తే అతన్ని రమ్మని సైగ చేయచ్చని వాళ్ళనే చూడసాగింది. 'గురుడు చేతికి చిక్కాడు. పక్కింటావిడ మొగుడితో చెప్తాన'ని బ్లాక్‌మెయిల్ చేయచ్చు.' పైశాచికంగా నవ్వుకుంది.

ఇంతలో శ్రీధర్ పార్కింగ్‌లోని ఎవరినో చూసి, నవ్వుతూ అటువైపు వెళ్ళడం చూసి, వనజ కుతూహలంగా చూసింది. కానీ పార్కింగ్ మీదే కట్టిన ఫ్లాట్స్ అవడంతో ఆమెకి కనిపించలేదు. మరింత వంగింది.

అకస్మాత్తుగా ఆమె కాళ్ళు గాల్లోకి లేచి వనజ బరువైన శరీరం రెయిలింగ్ మీంచి కిందకి జారిపోయింది. కిందున్న వాళ్ళు హాహాకారాలు చేసారు.

తల్లి పెంచుతున్న కుక్క బెల్ట్ పట్టుకుని వస్తున్న శ్రీధర్ తన ముందు దబ్బున పడిన వనజ దేహాన్ని చూసి పెద్దగా కేకేసాడు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments